క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



ఎమ్మెల్యే ఎలీజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న మండల కన్వీనర్లు

కామవరపుకోట : ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని సచివాలయాల కన్వీనర్‌గా రావికంపాడుకు చెందిన షేక్ మీరా షాబి (ఏసుబాబు)ను, కామవరపుకోట టౌన్ కన్వీనర్‌గా కొండగూడెం గ్రామానికి చెందిన పండు ప్రసన్నలను నియమించడంపై ఆదివారం వారు జంగారెడ్డిగూడెం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎలీజాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా కృషి చేయాలన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

టి.నరసాపురం : టి.నరసాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిన ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి చెందిన 15మంది వైద్యులతో టి.నరసాపురం శివాలయ కళ్యాణ మండపంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. సాధారణ వ్యాధులతో పాటు కళ్లు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, గుండె, ఎముకలు, కీళ్ల వ్యాధులు, స్త్రీల వ్యాధులు, చర్మ వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన రోగులకు ఈసీజీ కూడా తీస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన కేవీఎస్ సురేష్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం రూ.2లక్షల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రోగులకు అల్పాహారం అందజేత

జంగారెడ్డిగూడెం : స్థానిక ఏరియా ఆసుపత్రిలోని రోగులకు మానవత ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం, పాలు అందజేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షుడు మహంకాళి రంగప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న 100 మంది రోగులకు అల్పాహారం, పాలు అందజేసినట్లు చెప్పారు. ఈ విధంగా 4రోజుల పాటు ఉదయం సమయంలో రోగులకు అల్పాహారం, పాలు అందిస్తామన్నారు. మానవత సభ్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, డాక్టర్ వజ్రకిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షురాలు త్రిపుర, కోశాధికారి పల్లి వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎలికే తాతారావు, ఎల్ఐసీ కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ దల్లి కేదారేశ్వరరెడ్డి, రిటైర్డ్ డీఎఫ్‌వో సత్యనారాయణ, గంధం గోపాలకృష్ణ, రమేష్, చిరంజీవి, మేఘన, దిలీప్‌సూర్య పాల్గొన్నారు.

ఉల్లాసంగా రోటరీ క్రికెట్ పోటీలు

జంగారెడ్డిగూడెం : రోటరీ సూపర్ ఎయిట్ క్రికెట్ పోటీలు రెండోరోజు ఉల్లాసంగా సాగాయి. ఈ క్రీడా పోటీల్లో భాగంగా రాజకీయ ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక పోటీని నిర్వహించినట్లు రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ తెలిపారు. అందరూ నిత్యం ప్రజల మధ్యన నిలిచి తమ తమ పార్టీ విధానాలు, లక్ష్యాలను అనుసరించి ప్రజా ప్రయోజనాల కోసం పాటుపడే జంగారెడ్డిగూడెం రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ స్నేహపూర్వక పోటీలో పాల్గొని స్ఫూర్తిని నింపారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజా ప్రతినిధులకు అధ్యక్షుడు దాకారపు కృష్ణ, కార్యదర్శి ఉడా రాంగోపాల్(గోపీ), సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల్నాటి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

24న చలో భీమవరం

దెందులూరు : ఉభయగోదావరి జిల్లాలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ విభాగాల నాయకులు, కార్యకర్తలు ఈనెల 24న భీమవరం తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం అక్కిరెడ్డిగూడెంలో మాట్లాడుతూ మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై బీజేపీ వైఖరిని తెలియజేయాలని, వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్మానం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామన్నారు. చలో భీమవరం కార్యక్రమంను విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు కే మురళి కోరారు.

జంగారెడ్డిగూడెంను అభివృద్ధి చేస్తాం

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



జంగారెడ్డిగూడెం 26వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి జంగారెడ్డిగూడెంను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలోని 26వ వార్డులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికి వెళ్లి ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ముందు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలో సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామని, ఇంకా ఎవరైనా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందకపోతే వారు దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రం మొత్తం అభివృద్ధికి దూరంగా ఉందని, వాటి తాలూకా ఇబ్బందులను తొలగించుకుంటూ ఒక పక్క సంక్షేమాన్ని అమలు చేస్తూనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించే సీఎం దొరకడం మన అదృష్టమని అన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ వందనపు సాయిబాల పద్మ, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పార్టీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, కౌన్సిలర్‌లు, నాయకులు బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యం

కొయ్యలగూడెం : రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టే దిశగా బీసీలు సంఘటితం కావాలని రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పిలుపుఇచ్చారు. ఆదివారం సాయంత్రం కొయ్యలగూడెంలోని వైఎస్సార్ నగర్‌లో భాస్కరరావు అభినందన కార్యక్రమం అతిరాస కార్పొరేషన్ డైరెక్టర్లు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలో అతిరాస కులాన్ని గుర్తించి వారిని బీసీ జాబితాలో చేర్పించింది మహానేత వైఎస్సార్ అయితే, వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ పరిధిలోని 16 కులాల వారికి సంక్షేమ పథకాలు అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రెండోసారి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లు తేలే వెంకటేశ్వరరావు, బుర్రి మంగతాయారు, దూళి అచ్చియ్యమ్మ, చల్ల భవాని, గంట పద్మావతి, కొండా సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

కామవరపుకోట : జలపవారిగూడెం గ్రామంలో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుపై ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య వివాదం ఏర్పడింది. వివరాల ప్రకారం మండలంలో కామవరపుకోట విచారణకు చెందిన జలపవారిగూడెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఉంది. చర్చికి ఎదురుగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయడానికి అదే సామాజిక వర్గానికి చెందిన చర్చికి చెందిన ఒక వర్గం రెండు రోజుల క్రితం ఇటుకలతో సిమెంట్ దిమ్మను నిర్మించారు. అయితే చర్చికి సంబంధించిన మరి కొందరు చర్చికి ఎదురుగా విగ్రహం ఏర్పాటు చేయొద్దని వారికి చెప్పారు. అయినా విగ్రహం ఏర్పాటుకు నిర్మాణం చేపట్టడంతో వివాదం మొదలైంది దీనితో చర్చికి సంబంధించిన ఒక వర్గం చర్చికి ఎదురుగా విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన సిమెంట్ దిమ్మను శనివారం రాత్రి 12 గంటల సమయంలో ధ్వంసం చేస్తుండగా విగ్రహం ఏర్పాటు చేస్తున్న వర్గం స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పి పంపించారు. ఆదివారం ఉదయం మళ్లీ వివాదం మొదలు కావడంతో జంగారెడ్డిగూడెం సీఐ బాల సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో పక్కనే వేరొక స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసే విధంగా ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు.



సంఘటన స్థలం వద్ద విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన సిమెంట్ దిమ్మెను ధ్వంసం చేసిన దృశ్యం

చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఇరిగేషన్ శాఖ ఏపీడీ అచ్యుతరావు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం లక్ష్మడుగూడెం సచివాలయ పరిధిలోని దేశాలవారి కట్టు చెరువు, బూసరాజుపల్లి సమీపంలోని తాళ్ల చెరువుతో పాటు బుట్టాయగూడెం గ్రామ సమీపంలో ఉన్న జగ్గాపు చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని ఇరిగేషన్ శాఖ ఏపీడీ కె.అచ్యుతరావు తెలిపారు. మండలంలోని కొమ్ముగూడెంలో చెరువుల అభివృద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలో ఉన్న కాల్వలు, గట్లు, తూములు, కలింగలు పరిస్థితులను పరిశీలించామని వాటి అభివృద్ధికి కృషి చేయడం ద్వారా ఆయా చెరువుల పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు పుష్కలంగా పంటలు పండించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ ఎ.శ్రీనివాసరావు, సేవా సంస్థ టీమ్ లీడర్ డి. సత్యనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, రైతులు గాంధీ, పరమేశ్వరరావు, సేవాసంస్థ సీఓఐడీ యు.రాజ్‌కుమార్, సీఓఎస్‌ఏపీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్ముగూడెంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ధార్మిక పరిషత్ సభ్యుడు శ్రీరామమూర్తికి సత్కారం

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సభ్యుడు వెలగా శ్రీరామమూర్తిని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ముందుగా కల్యాణ మండప ట్రస్టు చైర్మన్ బొండాడ రామ్మోహనరావు ఆయనకు దుశ్శాలువాను కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ శ్రీరామమూర్తి ధార్మిక పరిషత్ సభ్యుడిగా నియమితులవడం హర్షణీయమన్నారు. హిందూమత అభివృద్ధికి ఆయన మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీరామమూర్తి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన వారికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. హిందుత్వాన్ని పెంపొందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ట్రస్టు పాలకవర్గ సభ్యులు, ఆర్యవైశ్య పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ట్రస్టు చైర్మన్ రామ్మోహనరావు

రాజవరంలో అబ్బురపరిచిన విన్యాసాలు

కొయ్యలగూడెం : రాజవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన మాదిగ మాస్టీ ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం వేళల్లో రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన బుద్ధుల రాజు పర్యవేక్షణలో 12 మంది బృందంలోని సభ్యులు పలు విన్యాసాలు నిర్వహించారు. పొట్టేలుతో ఎదురుపడి తలతో ఢీకొట్టడం, బండరాళ్లను బాహువులపై ఉంచుకొని నడవడం, ఒకరిపై ఒకరు నిలబడిన విన్యాసాలు, నీళ్ల బిందెలను పళ్లమధ్య కట్టుకొని పైకి లేపడం, 100 కేజీల రాళ్లను పైకి విసిరి భుజంతో ఢీకొట్టడం, ఇలా 25 పైగా నిర్వహించారు. ఈ విన్యాసాలను ముందుగా గ్రామ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపీటీసీ తమిర్చి బ్రహ్మయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, భీమడోలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



రాజవరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

లింగపాలెం మండల సేవాదళ్ కన్వీనర్‌గా రెడ్డి బాబ్జి

లింగపాలెం : లింగపాలెం మండల వైఎస్సార్ సేవాదళ్ కన్వీనర్‌గా లింగపాలెం గ్రామానికి చెందిన రెడ్డి బాబ్జి(శ్రీనివాసరావు)ను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఆదివారం భీమవరంలో జరిగిన జిల్లా సేవాదళ్ మండల కన్వీనర్ల సమావేశంలో రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ చిన్నమిల్లి వెంకటరాయుడు ప్రకటించారని రెడ్డి బాబ్జి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి యువజన నాయకుడిగా ఉన్న ఆయన చింతలపూడి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పనిచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, ఆదేశాలకు అనుగుణంగా మండలంలో పార్టీని పటిష్టం చేయడానికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులు, బీవీఎస్ రెడ్డికి బాబ్జి కృతజ్ఞతలు తెలియజేశారు.



గిరిధర్ రెడ్డితో రెడ్డి బాబ్జి

నేడు అచ్యుతాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరై ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలను గురించి అడిగి తెలుసుకుంటారని అన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష





ఏలూరులోని సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు
సీఆర్‌రెడ్డి ఇంటర్ క్యాంపస్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. ఏలూరు జిల్లా పరిధిలో భారీ ఎత్తున అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక పరీక్షకు హాజరయ్యారు. ఏలూరు సీఆర్‌ఆర్ విద్యాసంస్థల వద్ద పరీక్షకు హాజరైన అభ్యర్థుల దృశ్యాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

వినోదభరితంగా హాసం క్లబ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలలో నిర్వహించే హాస్య కదంబ కార్యక్రమం ఆదివారం అత్యంత వినోదభరితంగా సాగింది. హాసం క్లబ్ కన్వీనర్ జీఎస్ఆర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు హాస్యవల్లరి ప్రదర్శించారు. కొందరు సభ్యులు జోకులు వినిపించి నవ్వులు కురిపించగా మరికొంత మంది పేరడీ పాటలు, ఇంకొందరు పాత సినీ గీతాలు ఆలపించి కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన వ్యాపారవేత్త దొంతంశెట్టి విశ్వేశ్వరరావును క్లబ్ తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాసం క్లబ్ సభ్యులు ఎస్.బాబి, గురుశర్మ, శ్రీహరి కోటి, టి.శుభ, పి. దుర్గ, డాక్టర్ దొంతంశెట్టి బసవరాజు, ఎస్.చంద్ర, ఎ.మహీధర్, ఎస్ఆర్ ప్రతాప్, మల్లినేని బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారవేత్త దొంతంశెట్టి బసవరాజును సన్మానిస్తున్న హాసం క్లబ్ ప్రతినిధులు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు పొడిగింపుపై హర్షం

ఏలూరు (టూటౌన్) : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువును మరో పదేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో నాటి సీఎం ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చారని, దాని గడువు ఈ యేడాది జనవరితో పూర్తి కానుందన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, మేధావులు గడువు పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారని గుర్తు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువును మరో పదేళ్లు పొడిగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వినియోగించని అధికారులపై అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాల్సిందిగా ఆయన ఈ సందర్భంగా కోరారు. సబ్‌ప్లాన్ గడువును పెంచడం ద్వారా మరోసారి పేదల పక్షపాతిగా నిరూపించుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల తరుపున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, కార్యాలయ ఇన్‌చార్జి పల్లా యేసేబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవాలకు తరలిరావాలి

భీమడోలు: ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలకు మండలం నుంచి బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జీజే రవికాంత్, మండల ప్రధాన కార్యదర్శి జి.బాలభాస్కర్ ఆదివారం కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు బాలోత్సవంలో పాల్గొని విజేతలుగా నిలవాలని కోరారు. 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న బాలబాలికలు పాల్గొనవచ్చునన్నారు.

క్రీడా పోటీల్లో గోపన్నపాలెం కళాశాల విద్యార్థినుల విజయభేరి

దెందులూరు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అంతర కళాశాలల క్రాస్‌కంట్రీ క్రీడా పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థినులు విజయభేరి మోగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ పీడీకేడీ ప్రసాద్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ల సంయుక్త శిక్షణలో భాగంగా అఖిలభారత క్రాస్‌కంట్రీ పోటీలకు గోపన్నపాలెం కళాశాల విద్యార్థినులు ఆరుగురు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. వీ.పూజ, బైరెడ్డి లీలావతి, జీ.నందిని, ఎ.లక్ష్మి, ఎస్. నాగదుర్గ, జీ. గంగాభవాని అఖిలభారత క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికై గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రతిష్టను ఇనుమడింప చేశారని ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, ఇన్‌చార్జి ప్రసాద్ అన్నారు.

నేడు లింగపాలెం మండలంలో ఎమ్మెల్యే ఎలీజా పర్యటన

లింగపాలెం : లింగపాలెం మండలంలో సోమవారం చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పర్యటిస్తారని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరావు ఆదివారం విలేకర్లకు తెలిపారు. నరసన్నపాలెంలో ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేస్తారని, అనంతరం 10 గంటలకు బాదరాలలో జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరవుతారని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఎంపీ మార్గాని భరత్ పీఆర్‌వోగా పృథ్వీగౌడ్



పృథ్వీ గౌడ్

కొయ్యలగూడెం : రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్‌కి పీఆర్‌వోగా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన అంగర పృథ్వీ గౌడ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం ఎంపీ పీఏ కృష్ణమోహన్ అధికారికంగా ప్రకటించారు. కొయ్యలగూడేనికి చెందిన పృథ్వీ ఏడాది కాలంగా రాజమండ్రిలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఎంపీ మార్గాని భరత్ నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రూట్ మ్యాప్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పృథ్వీ గౌడ్ కృషిని గుర్తించి ఎంపీ భరత్ సూచన మేరకు పీఆర్‌వోగా నియమించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కొయ్యలగూడెంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసినందుకు గుర్తింపు లభించిందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి సమష్టి కృషి చేయాలని పృథ్వీ అన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

జంగారెడ్డిగూడెం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణంలోని ఆరు డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.స్లీవ జోజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విభాగాల్లో వేర్వేరుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదు రూపంలో అందజేస్తామన్నారు. విద్యార్థుల ఫీజులకు ఉపయోగపడేలా దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. 25వ తేదీన ఈ బహుమతులు అందజేస్తామన్నారు.

సత్యనారాయణ మృతి తీరని లోటు



ఆవుల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయి గ్రామంలో ఆదివారం ఆవుల సత్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. నాయకులు మాట్లాడుతూ సత్యనారాయణ గత నాలుగేళ్లుగా సీపీఎం కార్యదర్శిగా పార్టీ ఆశయాల కోసం భూపోరాటాలు, స్థానిక సమస్యలపై పోరాటం చేశారన్నారు. సత్యనారాయణ మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రవి. తెల్లం దుర్గారావు, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకరరావు, సుభాషిణి, యాగంటి సీత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్ అమలు

చింతలపూడి : చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇస్లావతు నాగేశ్వర్రావుపై పీడీ యాక్టు క్రింద కేసు నమోదు చేసి సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు ఎస్ఈబీ సీఐ సాయి స్వరూప్ శనివారం తెలిపారు. నాగేశ్వర్రావుపై గతంలో 5 సారాయి కేసులు నమోదై ఉండటంతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ యాక్టు అమలు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాలతో పదే పదే సారాయి కేసులు నమోదైన వారిపై కూడా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.